


ఫస్ట్‌క్లాస్ చదువుతున్న ప్రియ వెక్కివెక్కి ఏడుస్తోంది. తన వెక్కిళ్ల సవ్వడి కిచెన్‌లో ఉన్న తల్లి మధుమతికి వినబడకుండా జాగ్రత్త పడుతోంది. అయినప్పటికీ ప్రియ మనోవేదన ఇంకా ఉధృతమవుతోంది.

రోజూ ఆ టైములో తల్లి పెట్టిన స్నాక్స్ తింటూ హోమ్‌వర్క్ చేసేది ప్రియ. కానీ ఆ రోజు స్కూలులో జరిగిన సంఘటన కారణంగా ఇంపోజిషన్ వ్రాయవలసి వచ్చింది.

ఇంగ్లీషు తప్ప తెలుగు మాట్లాడకూడని ఆ కాన్వెంటులో ప్రియ పొరపాటున స్నేహితురాలితో తెలుగులో మాట్లాడింది. ఆ కారణంగా టీచర్ ప్రియని గట్టిగా కేకలేయడం జరిగింది. దానికి ఆ పని

**జి. మేరీకృపాబాయి**

# తెలుగులో మాట్లాడను

మనసు గాయపడింది. ప్రియకు ఇంపోజిషన్ వ్రాయమని పనిష్మెంటు కూడా ఇచ్చారు. దానితో ప్రియ వేదనకు అంతులేకుండా పోయింది.

"నేను తెలుగులో మాట్లాడను అని వంద సార్లు ఇంపోజిషన్ వ్రాసి తీసుకురా" టీచర్ ఇచ్చిన పనిష్మెంట్ గుర్తుకు వచ్చింది ప్రియకు.



ప్రియ ఏడుపు ఇంకా ఎక్కువైంది. ఏడుస్తూనే నోట్‌బుక్ చేతిలోకి తీసుకుంది. ఇంపోజిషన్ వ్రాయడం మొదలుపెట్టింది.

"నేను తెలుగులో మాట్లాడను
నేను తెలుగులో మాట్లాడను" అని పది సార్లు వ్రాసింది.

క్లాసులో టీచర్ కేకలు వేసిన విషయం మళ్లా జ్ఞాపకానికి వచ్చింది ప్రియకు.

మనసులోని బాధను దిగమ్రింగుకుంటూ మళ్లా ఇంపోజిషన్ వ్రాయడం ప్రారంభించింది.

ఇంతలో ప్రియతల్లి మధుమతి ప్రియకు స్నాక్స్ తీసుకువచ్చింది. ప్రియ ఏడుస్తున్నట్లు గమనించింది.

"ప్రియా! ఏమిటమ్మా... ఏడుస్తున్నావ్?" అంది ఆందోళనగా

వెంటనే ప్రియ తను ఇంపోజిషన్ వ్రాస్తున్న నోట్స్ తల్లి చూడకుండా మూసేసింది.

"ఏమిటమ్మా! ఏమిటి వ్రాస్తున్నావ్?" అంటూ నోట్‌బుక్ ఓపెన్ చేసి చూసింది మధుమతి.

ప్రియ వ్రాస్తున్న ఇంపోజిషన్ చూసి ఆశ్చర్య పోయింది మధుమతి.

"ఏమిటి ప్రియా! స్కూల్‌లో ఏం జరిగింది?" అంది మధుమతి.

"నేను తెలుగులో మాట్లాడాను మమ్మీ! అందుకే ఇలా ఇంపోజిషన్ వ్రాయమన్నారు" అంది బాధగా ప్రియ. ప్రియ చెక్కిళ్ళ మీదుగా కన్నీరు స్రవిస్తోంది.

> ఆడవాళ్ళు మగవాళ్ళకంటే
> బాగా వినగలరు.

ఇంత చిన్న పిల్లకు అంత ఇంపోజిషన్ ఇస్తే ఎలా?" అనుకుంది మధుమతి.

"ప్రియా! కాసేపు ఆడుకో. తరువాత వ్రాద్దువుగాని" అంది మధుమతి.

"లేదు మమ్మీ ఇప్పుడే వ్రాస్తాను" అంటూ మళ్లీ ఇంపోజిషన్ వ్రాయడం మొదలు పెట్టింది ప్రియ.

"ఏమిటో ఇప్పటినుంచే చిన్న పిల్లలకు ఇన్ని బాధలు" అనుకుంటూ నిట్టూర్చింది మధుమతి.

* * *

ఆ రోజు రాత్రి ప్రియకు విపరీతంగా జ్వరం వచ్చింది. నిద్రలో ఒకటే కలవరింతలు.

"నేను తెలుగులో మాట్లాడను"
"నేను తెలుగులో మాట్లాడను" అంటూ ఒకటే కలవరిస్తోంది ప్రియ.


ప్రియ తల్లిదండ్రులిద్దరూ ఒకటే కంగారు పడిపోయారు. జరిగిన విషయమంతా మధుమతి భర్తకు వివరించింది.

"కాన్వెంటులో మరీ అంత స్ట్రిక్ట్‌గా ఉంటే ఎలా? చిన్న పిల్లలు బాధపడరూ" అన్నాడు ప్రియ తండ్రి కూడా.

ఆ మరుసటి రోజు క్లాస్ టీచర్ దగ్గరకు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు ప్రియ తండ్రి అరుణ్. టీచర్ విషయం విని పెద్దగా స్పందించలేదు.

"ఇంగ్లీషు మాట్లాడడం పిల్లలకు బాగా అలవాటు చేయడం కోసం తెలుగు మాట్లాడుతుంటే మేము ఒప్పుకోవట్లేదు" అంది టీచర్.

"అదేమిటి మేడమ్! ఇంగ్లీషుని ఇంప్రూవ్




చేయడం కోసం తెలుగుని పూర్తిగా బాన్ చేయవలసిన అవసరం ఏముంది? ఇంగ్లీషుకి ఇవ్వవలసిన ఇంపార్టెన్స్ ఇంగ్లీషుకివ్వండి. తెలుగుకి ఇవ్వవలసిన విలువ తెలుగుకి ఇవ్వండి. తెలుగు మాతృభాష. ఆ పసిపిల్లలు తమ మనసులోని భావాలను స్పష్టంగా చెప్పాలంటే మాతృభాషలోనే చెప్పగలుగుతారు" అన్నాడు అరుణ్.

అయినప్పటికీ టీచర్ దగ్గర నుంచి సరైన సమాధానం రాలేదు. ఆమె మొండి వైఖరితోనే ఆమె ఉంది.

* * *

వారం రోజుల తరువాత ఒకరోజు స్కూలు నుంచి ప్రియ ఏడుస్తూ వచ్చింది. వచ్చీరావడంతోనే బెడ్‌పై వాలిపోయింది. మధుమతి కంగారు పడుతూ ప్రియ దగ్గరకు వెళ్లింది.

ప్రియ ఒళ్లంతా చెమటలు పట్టి చల్లబడిపోయింది. ఊపిరి పీల్చుకోవడానికి కూడా కష్టపడుతోంది. ఆమె నోట మాట కూడా సరిగా రావడం లేదు.

"ప్రియా! ఏమైందమ్మా? అలా అయిపోతున్నావేమిటి?" అంది మధుమతి.

"ఉదయం నుంచీ నాకు గుండెల్లో నొప్పిగా ఉంది మమ్మీ. చాలా బాధగా ఉంది" అంటూ చెప్పలేక చెప్పింది.

"ఉదయం నుండీ నొప్పిగా ఉంటే క్లాసులో టీచర్‌తో చెప్పలేదా ప్రియా?" అంది మధుమతి.

"అలా అని టీచర్‌తో ఇంగ్లీషులో చెప్పడం నాకు రాదు మమ్మీ. తెలుగులో చెబితే మళ్లా ఇంపోజిషన్ వ్రాయమంటారు మమ్మీ" అంది ప్రియ నొప్పితో బాధపడుతూనే.

మధుమతిలో ఆందోళన, కంగారు ఇంకా ఎక్కువయ్యాయి.

"వెంటనే ప్రియను డాక్టర్ దగ్గరకు తీసుకు

వెళ్లాలి" అనుకుంటూ డాక్టర్ దగ్గరకు వెళ్లడానికి రడీ అవుతోంది మధుమతి.

ప్రియ ఇంకా నీరసపడిపోయి రొప్పడం ప్రారంభించింది.

"మమ్మీ!" అంటూ పిలిచింది ప్రియ.

"ఏమిటి ప్రియా!" అంది మధుమతి.

"నాకు గుండెల్లో నొప్పిగా ఉంది అనడాన్ని ఇంగ్లీషులో ఏమంటారు మమ్మీ!" అంది ప్రియ.

"ఎందుకు ప్రియా" అంది మధుమతి.

"టీచర్‌తో చెప్పడానికి..." అంటూ పూర్తిగా బెడ్‌పై వాలిపోయింది ప్రియ.

కంగారు పడుతూ వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లింది మధుమతి. డాక్టర్ వెంటనే ప్రియను పరిశీలించి అన్ని పరీక్షలూ చేసాడు.

"ప్రియకు ఏమైంది డాక్టర్?" అంది మధుమతి కంగారుపడుతూ.

"ప్రియ పరిస్థితి ఏమీ బావుండలేదు. ప్రియకు హార్ట్‌లో రంధ్రం ఉంది. ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించింది. మీరు ప్రియను ఆలస్యంగా హాస్పటల్‌కి తీసుకురావడం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది. ప్రియను వెంటనే హైదరాబాద్ తీసుకువెళ్లాలి. అయినప్పటికీ నమ్మకం చెప్పలేను" అన్నాడు డాక్టర్.

డాక్టర్ మాటలకు భోరుమంది మధుమతి.

ఇంతలో అరుణ్ వచ్చాడు.

"ఏమిటి డాక్టర్! మా ప్రియకు ఏమైంది?" అన్నాడు కంగారుగా. జరిగిన విషయమంతా వివరించి చెప్పాడు డాక్టర్.

"ఆలస్యంగా తీసుకురావడం వల్లనే మీ పాప పరిస్థితి విషమించింది" మళ్ళీ చెప్పాడు డాక్టర్.

"గుండెల్లో నొప్పిగా ఉందనే విషయం టీచర్‌కి ఇంగ్లీషులో చెప్పడం చేతకాక ప్రియ ఉదయం నుంచీ అలానే స్కూల్లో ఉండిపోయిందట. అందుకే నా ప్రియకు ఇప్పుడీ విషమ పరిస్థితి వచ్చింది" విలపిస్తూ చెప్పింది మధుమతి.

అరుణ్ మెదడు మొద్దుబారిపోయింది. ఏమి చేయాలో పాలుపోక రెండు క్షణాలు ఎటో చూస్తూ నిలబడ్డాడు. వెంటనే తేరుకొని ఆంబులెన్స్ రడీచేసి హైదరాబాద్ బయలుదేరారు మధుమతి, అరుణ్.

"మనసు విప్పి మాతృభాషలో తన బాధను చెప్పుకోలేకపోవడం వల్లనే ప్రియకు ఈ దుర్భర పరిస్థితి వచ్చింది" భోరున విలపిస్తూ అంది మధుమతి.

విపరీతంగా ఆయాసపడుతూ బాధతో మెలికలు తిరిగిపోతున్న ప్రియను చూస్తుంటే అరుణ్ గుండె ద్రవించి పోయింది.

మరి కాసేపటికి ప్రియ కళ్లు శాశ్వతంగా మూతబడిపోయాయి.

మధుమతి, అరుణ్ పెద్దపెట్టున రోదించసాగారు.

"నేను తెలుగులో మాట్లాడను" అంటూ కలవరిస్తున్న ప్రియ రూపం కళ్లముందు కనబడింది అరుణ్‌కి.

"మమ్మీ! గుండెల్లో నొప్పిగా ఉంది అనడాన్ని ఇంగ్లీషులో ఏమంటారు?" అంటున్న ప్రియ రూపం కళ్లముందు కదలాడుతోంది మధుమతికి.